# కాంపెన్సేషన్

కమల ఉలిక్కిపడి మేలుకుని కాలికేసి చూసుకుంది. కాలు నిన్నా మొన్నటి మాదిరే కట్లతో భారంగా పడివుంది. తనకాలింకా తీసెయ్యలేదు. రెండు రోజులుగా ఏవో పీడకలలు. కలలో ......... రెండుకాళ్ళు. ఆకాళ్ళతీవెలకు విచ్చిన పూవుల్లా రెండు పాదాలు. అజంతా, ఎల్లోరా, లేపాక్షి, హంపి మొదలైన చోట్ల శతాబ్దాలుగా నృత్యాలు చేసి అలసిన శిల్పసుందరుల పాదా లేమో! అలంకరించిన వెండి పట్టాలతో, పారాణిపూతతో, పట్టు చీరకుచ్చిళ్ళ చాటున, ముందుకు కదలివస్తున్నపాదాలు......... ఎవరివీ పాదాలు? మనిషి లేకుండా పాదాలు కదిలిరావడమా............ అనుకుంటూండగా, పాదాలపైన మనిషి మొలుస్తుంది. చిత్రంగా అది తనే! ఇంకోసారి.......... ఏదో తెర. పొడవాటి, సన్నటినీడ పడుతుంది. తెరమీద. ఆనీడ ఎవరికోసమోచూసి చూసి, నిరాశగా వెనుతిరుగుతుంది. అప్పుడు చూస్తే.......... ఆనీడ ఆ అమ్మాయి నీడ దానికి ఒకాలుబదులు చేతికర్ర వుంది. టక్...... టక్ మని కొట్టుకుంటూ ఎక్కడికో వెళ్ళిపోయింది. ఆ నీడదూరంగా వెళ్ళే కొద్ది టక్....... టక్ లు మరీ దగ్గరగా, తనగుండె లో నుంచీ వినిపించాయి. భయపడి మేలుకుంది.

కమల కదలకుండా కళ్ళు తిప్పి ఎడం వైపు చూసింది. తల కింద చేయివుంచుకుని వట్టి నేలమీదనే పడుకుని నిద్రబోతూంది అమ్మ. అది మామూలు నిద్రమాదిరిలేదు. అలసటతో, దుఃఖంతో మూర్ఛపోయినట్టుగా వుంది. అట్లాపడివున్న అమ్మను దాహమవుతూందని లేపబుద్ధి కాలేదు కమలకు. పాపం...... రెండు రోజుల్నించీ ఎంత గొడవపడివుంటుందో! రెండు రోజుల్నించీ ఏమిటి! ఇరవైఏళ్ళుగా ఆమె గొడవపడుతూనే వుంది. అమ్మ ఎప్పుడు నవ్విందో తనకుజ్ఞాపకమేలేదు. నవ్వుతో ఎప్పుడూ అవసరమే రానట్టు వుంటుంది అమ్మ మొట్టమొదట, అమ్మకు పెళ్ళయిన రోజుల్లో నవ్వివుంటుందా? అమ్మను అప్పుడు చూసివుంటే బావుండేది. ఒకప్పుడు, అమ్మ ఇట్లావుండేది అని జ్ఞాపకం చేసుకునేందుక్కూడా వీల్లేకుండా, తనకు జ్ఞాపకం వచ్చినప్పట్నించీ అమ్మ ఇట్లనే వుంది. అవును......... అట్లజరిగితే, అట్లగానీ జరిగితే, అమ్మనవ్వుతూ వుండదా? ఎప్పుడూ నవ్వుతూనే వుంటుంది. నిజంగా అట్లజరగదనుకో,

జరగడానికి ఏమాత్రం వీలేలేదనుకో ....... వూరికే అనుకుంటే, అమ్మను సంతోషంగా వున్నట్టుచూడడానికి అనుకుంటే తప్పేముంది?

కుట్టుమిషన్ సెంటర్ కెదురుగ్గా వుండే ఆ ఇంటినీ, ఆ ఇంట్లో వుండే అతన్నీ, అతని దిన చర్యల్నీ 'వూరికే' గమనిస్తూవచ్చింది కమల. ఆ ఇల్లు చాలా బావుంది. అతనూ చాలా బావున్నాడు. అందరూ వేసుకునేబట్టలే వేసుకున్నా ఎందుకంత దర్జాగా బావుంటాడో అతను! అవునూ.... ఆ యిల్లు అతనూ బావుంటే మాత్రం తనకేమి సంబంధం? ఏమీ సంబంధం లేదు. తను ఓ బీదింటి పిల్ల. పనీపాటా లేకపోయినా ఎప్పుడూ గొప్పలు చెప్పుకుంటూ తిరిగే తండ్రీ, జులాయి తమ్ముడూ, పెండ్లి కెదిగిన చెల్లెలూ, అయిదు చదివే ఇంకో చెల్లెలూ.........! తను కుట్టుమిషన్ సెంటర్లో పని చేసి తెచ్చే డబ్బే అందరికీ తిండి. "పెళ్ళి కావల్సిన పిల్ల బజార్న పడి తెస్తేతిని బజార్లు తిరగడమేనా?" అని అమ్మ అంటున్నా, దులిపేసుకుని వెళ్ళి పోతుంటాడు నాయన. అతనికింకా పెండ్లి కాలేదంట! ఎందుకు చేసుకోలేదో? బోలెడు కట్నా లిచ్చిచేసుకునే వాళ్ళుంటారుగా! కట్నం అక్కర్లేదా? పిల్ల అందంగావుండి, తనకు నచ్చితే బీద పిల్లయినా చేసుకుంటాడా? కట్నం ఎందుకొద్దంటాడు? బీదపిల్లనెందుకు చేసుకుంటాడు? వూరికే అనుకోడానికి, అతను కట్నంతీసుకోకుండా బీదపిల్లను పెండ్లి చేసుకుంటే ఎంత బావుంటాది! కట్నం ఇవ్వలేని, ఓ పేద ఇంటిపిల్లతో అతని పెళ్ళి చాలా సార్లు జరిపించేసింది కమల. ఎన్ని సార్లు జరిపించినా తృప్తి తీరదు, ఎప్పటి కప్పుడు కొత్తగా, గమ్మత్తుగా, మత్తుగా వుంటుంది.

ఆ మత్తులో వుండగానే, ఆయాక్సిడెంట్ జరిగింది. ఆరోజు కమల సెంటర్ నుంచీ ఇంటికి వెళుతూంది. రోజూ ఇదే వేళకు అతను కారులో ఇంటికి వెళ్తూ ఎదురు పడతాడు. తనెప్పుడూ అతన్ని గురించి ఆలోచిస్తుందెందుకు? అని చిరాకు పడింది తనమీద. రోజూ యీ వేళకు ఎదురయ్యే వాడుకదా, ఇవ్వాళ ఎదురుకాలేదేమిటీ? అనుకుంది, అంతే. అందులో తప్పేముంది? అది సహజమే కదా! అని తనకు తనే సమాధానం చెప్పుకుంది. ఇంతలో దూరాన అతని ఎర్రకారు కనిపించింది. ఎండవేళ కనుక, వీధిలో జనం అట్టేలేరు. తను ఆ ఎర్రకారు కోసమే వెళ్తూన్నట్టు, ఆఎర్రకారు తనకోసమే ముందు కొస్తోన్నట్టూ అనిపించింది. తనకేమీ తెలీదు, తను తలవంచుకుని తనదారిన తనుపోతున్నాననుకుంది. ఒక్కసారిగా పక్క బంకులవాళ్ళు కేకలు వెయ్యడమేమిటి? ఆ ఎర్రకారు తన మీదుగా వెళ్ళడమేమిటి! ఒక్కక్షణంలో జరిగిపోయింది. ఆ తర్వాత ఆ కారులోనే తనను తీసుకొచ్చి ఈ ఆస్పత్రిలో 'అడ్మిట్' చేశాడట. రెండు రోజులూ వచ్చిచూసివెళ్ళాడనీ, పాపం ఆ అబ్బాయి ఎంతో బాధపడిపోతున్నాడనీ, అమ్మ చెప్పింది.

అతనొచ్చినప్పుడు, డాక్టర్లూ నర్సులూ అతనివెనకాలే వచ్చారనీ, అప్పట్నుంచీ తనను బాగా చూస్తున్నారనీ చెప్పింది.

అమ్మ యీసంగతి చెప్పిన తర్వాత, కమలకు కాలు నొప్పితగ్గి, 'రిలీఫ్'గా వున్నట్టనిపించింది. అది వరకూ అతన్ని గురించి ఆలోచించాలన్నా ఇబ్బందిగా వుండేది. తనకు తనే దొంగగా పట్టువడిపోతున్నట్టూ, తనకుతనే సంజాయిషీ ఇచ్చుకోవలసి వచ్చేట్టూ అనిపించేది. ఇప్పుడా అవసరం లేదు. అతని కారు క్రింద తను పడటం వల్ల, అతన్ని గురించి తను ఆలోచించడానికి హక్కు సంక్రమించినట్లు అనిపిస్తోంది. ఒకరకంగా దాన్ని అతనూ వొప్పుకున్నట్టే వుంది. తనపైన అంత శ్రద్ధ చూపడమంటే అదే. కేవలం అతన్ని గురించి ఆలోచించడమే కాదు, తనని అతను పెళ్ళి చేసుకున్నట్టు ఊహించినా అది ఇంతకుముందు కనిపించినంత అసంభవంగా కనిపించడం లేదు. ఎందుకు జరగకూడదు? తనమీద అతనికి సానుభూతి కలగవచ్చు, తను అతన్ని ప్రేమిస్తూన్న సంగతి తెలుసుకుని, ఒప్పుకోవచ్చు.

చప్పుడవటంతో కమలకళ్ళు తెరిచింది. తమ్ముడు దామోదరం అన్నంతెచ్చాడు. "అన్నం తీసుకొచ్చాను, అమ్మను లేపనా? అమ్మా! అమ్మా!" "అయ్యో! నిద్ర పోయానా? కమలా! అన్నం పెట్టనా అమ్మా" అనడిగిందామె.

"ముందుకొంచెం నీళ్ళు" ఆమె గ్లాసుతో నీళ్ళు ఇచ్చి, తర్వాత ఓప్లేటులో అన్నం కూర పెట్టి ఇచ్చింది. "నువ్వు పో ఇంక, శ్యామల స్కూలుకు పోతుందేమో" దామోదరం కదల్లేదు.

"ఎక్స్‌రే తీశారా?" 'ఆ.....' అన్నట్టు తలాడించిందామె. "అక్క కాలు విరిగిందా, వానిమీద కేసువేసి, కాంపెన్సేషన్ రాబట్టకుండా వదలకూడదు."

కమలకు అన్నం తినాలనిపించలేదు. నాయినకూడా ఇదే పాటే! కాంపెన్సేషన్ రాబట్టడం మీద నే కానీ, కాలుపోతే........... ఆ కుంటిదాని బతుకు ఏంకావాలన్నది లేదు. పోతేనే డబ్బు లొస్తాయనుకుంటున్నారేమో!

"నోర్మూసుకో, నువ్వేసిన కేసుకు ఆయనభయపడిపోతాడు! పాపం ఆ అబ్బాయి మంచివాడు, ఇప్పటికీ చాలా ఖర్చుపెట్టాడు."

"ఆ......... మంచివాడు! కళ్ళు మూసుకుని మనుషులమీద కార్లు తోలే మంచివాడు".

"కళ్ళు మూసుకుని కారుతోలినాడో, కమల పొరపాటుగా పడిందో నీకు తెలుసా?"

"నీయట్లాంటి వాళ్ళుంటే వాళ్ళకేం? ఎంతమంది నైనా చంపుతారు" అంటూ, తిట్టుకుంటూ వెళ్లాడు దామోదరం. అమ్మ అతన్ని మంచివాడు అనడం నచ్చింది కమలకు. తమ్ముడూ, తండ్రీ, అతన్ని తిడుతూ వుండటం ఏమాత్రం నచ్చలేదు. అవును..... అట్లా జరిగితే, వాళ్ళు అతన్ని తిట్టినందుకు పశ్చాత్తాపపడతారు. అతను మంచి వాడని తెలుసుకునేందుకు, అట్లా జరిగితే బావుంటుంది. అన్నం తిన్న కమలకు మళ్ళీ నిద్ర పట్టింది.

★ ★ ★

అమ్మతో ఎవరో మాట్లాడుతుంటే మెలకు వొచ్చింది.

"అప్పటికీ నేను చాలా ప్రయత్నించాను తప్పించాలని, సాధ్యం కాలేదు" అంటున్నాడు అతను. కమల కళ్ళు తెరచినట్టు గమనిస్తూ మంచందగ్గిరి కొచ్చి "ఐయాంవెరీ సారీ" అన్నాడు. కమల ఏంమాట్లాడలేకపోయింది.

"ఎక్సరే రిపోర్టు సంగతి తెలిసిందా?"

కమల అప్పటికీ మాట్లాడలేకపోయింది. ఆమె తన మీద ఆగ్రహంతో వున్నట్టు భావించాడతను. అతనలా అనుకుంటున్నట్టుగ్రహించిన కమల, అట్లాంటి దేమీలేదని చెప్పాలనుకుంది కానీ ఎట్లా చెప్పాలో తెలీక వూరుకుంది.

"సరే, నే కనుక్కుంటాను. వస్తానండీ" అని అమ్మకు నమస్కారం పెట్టిలేచాడు. వెళ్తున్న అతన్ని చూస్తోంది కమల. తను కోపంగా వున్నట్టు అనుకుంటున్నాడు. తను నిజంగా ఏమనుకుంటూందో తెలిస్తే ఏమంటాడు? తనేమనుకుంటూందో ఎందుకు తెలీడం లేదు అతనికి?

"హలో, మోహన్! ఏమిటిలావచ్చావు"

వార్డుపక్క వరండాలో నుంచీ వినిపిస్తోంది.

"ఓ అమ్మాయిని చూడాలనొచ్చాను. మొన్ననా కారు కింద పడిపోయింది"

"అసలే తాగుబోతుకారు, చమురొదిలే కేసేనా?"

"కారు కింద పడలేదులే. బెదిరిపడిపోయింది. కాలు బెణికి నట్టుంది. ఎక్స్‌రే రిపోర్టు చూద్దామనొచ్చాను. ఏమీ కాకపోతే, ఆమె కాలు ఆమెకుంటుంది, మన డబ్బు మనకుంటుంది."

ఇద్దరూ బిగ్గరగా నవ్వారు. మాట్లాడుకోవడం కూడా చిన్నగా ఏమీ మాట్లాడుకోలేదు. కమలకువినిపించేట్టు గానే మాట్లాడుకున్నారు. తనకు వినిపిస్తుందని అనుకోలేదా? వినిపిస్తే మాత్రమేం? అందులో తప్పేముంది, అను కున్నాడా? అవును, అందులో తప్పే ముంది? తను వింటే మాత్రం. "మన డబ్బు మన కుటుంది" అవును, తనకాలు తనకుంటుంది. ఆకాలు ఎప్పటికీ మిషన్ తొక్కుతూ వుంటుంది. కాలు విరగకపోతే, దామోదర్‌కూ, నాయినకూ 'కాంపెన్సేషన్' డబ్బులురావు. అందువల్ల అతని డబ్బులు అతనికుంటాయి.

కమల కళ్ళలో నీళ్ళు తిరుగుతోన్నాయి. కాలు విరగనందుకు ఏడుస్తూందో, అంతకంటే బలమైనదేదో విరిగినందుకు ఏడుస్తూందో కమలకే తెలీదు.

*(1973 జూలైలో 'ఆంధ్రపభ' వారపత్రికలో ప్రచురితం)*

# --. కథ గురించి. . .

*ఈ కథలో విశేషమేమీ లేదు.*

*రా.వి.శాస్త్రిగారి 'జరీఅంచు తెల్లచీర' 'మెరుపు మెరిసింది' (పేరు అదేనా?) లాటికథల ప్రభావం వుండి వుండవచ్చు.*

*దిగువమధ్య తరగతి అమ్మాయి ఆత్మవంచనతో కూడన కలలే అయినా, తండ్రీ తమ్ముడి లాంటి స్వార్ధంతో కాక, కుటుంబ సభ్యుల కోసం అట్లాజరగాలని కోరుకోడంలో కొంత ప్రత్యేకత (అట్లాంటికథల్లో) వుందేమో అనుకుంటున్నాను.*